కథానిక

# అప్పుడుపోయిన కామేశం

"విజయ"

భార్యపోయినా, అప్పట్లో మళ్ళీ పెళ్ళి తలంపు పెట్టుకోలేదు పేష్ట్రిటు గోవిందయ్యగారు. కాని రుక్మిణమ్మగారినిమటుకు పాపం, అస్తమానం తలుస్తూనే ఉండేవారు. కోర్టు తీర్పులతోటి ఆయనహృదయం కరిగిపోయి ఉండాలి. లేదా-పాషాణంఅన్నా అయిఉండాలి. ఆయనమాటల ధోరణి, చేష్టలు చూస్తే అల్లాగే అనిపిస్తాయి కూడాను. ఆడదిక్కులేని ఈ సంసారాన్ని అప్పట్లో వంటమనిషి, ఇద్దరు జవాన్లు చూస్తుండేవారు. అప్పుడప్పుడు విధవప్పగార్లు మంగమ్మగారు మాణిక్యమ్మగార్లు, అంటీ అంటనట్లుగా వస్తూ పోతూండేవారు. ఇన్నాళ్ళూ ఆఫీసు గొడవల్లో ఏమీ పట్టేదికాదు, కాని రిటైరైనాక గోవిందయ్యగారికి అన్నీ ఆలోచనలే. ఆడదిక్కులేక అవస్థపడుతుంటే, తన తర్వాత ఫలానా అని చెప్పుకునేందుకు ఎవ్వరూ లేకపోవడం, ఆయన్ని మరీ కలవరపెట్టింది. పోయిన రుక్మిణమ్మగారు తన జ్ఞాపకార్థం ఎవ్వరినన్నా విడిచి వెళ్ళినా బాగుండేదనుకున్నాడు. ఆలోచించగా సాటివాడు కాంతయ్యగారి రెండో వాణ్ణి "కామేశం"ని తెచ్చుకుంటే బాగుంటుం దనిపించింది.

కాంతయ్యగారు అపరాలకోర్టులో గుమాస్తా. గంపంత సంసారాన్ని ఆ కాస్త జీవితంలో ఎలా సాగిస్తున్నాడో అతనికే తెలియాలి. చారెడు గింజలొచ్చే సెంటు భూమిలేదు, నాల్గురాళ్ళు కలిసొచ్చే ఓ కొంపాలేదు. అలాగే యింటివారి సాధింపులతోటి ఇరకాటపు యింటితోటీ, ఆ పెంకుటింట్లోనే కాలక్షేపం చేస్తున్నాడు. పెద్దవాడు రామేశం మటుకు, ఆయేడే టీచరుగాచేరి, తండ్రిని ఆదుకుంటున్నాడు. నోటి మంచిమీద పక్కింటి ప్లీడరుగారబ్బాయికి, డాబా డాక్టరుగారి పిల్లలకి ట్యూషన్లు చెప్పి మరో పదిరాళ్ళు సంపాదిస్తున్నాడు. ఏం తెచ్చినా ఒకపూట నూకలన్నం తింటూన్నా, కాంతయ్యగారి సంసారానికి ఈ కరువు రోజుల్లో కాలక్షేపం చెయ్యడం కష్టంగానే ఉంటోంది. చదువులో శ్రద్ధ చూపిస్తున్న కామేశం సంగతి, గోవిందయ్యగారు అడిగితే, కుర్రాడు పైకి వస్తాడన్న ఉద్దేశంతో కాంతయ్య కాదనలేకపోయాడు. తన యింటి పరిస్థితుల్నిబట్టి ఒకవిధంగా బాగానే ఉందనుకున్నాడు కూడాను. కాని మాతృహృదయం కామేశ్వరమ్మగారు కంపించిపోయింది. మనతోటే ఉంటాడంది. కాని కొడుకు పైకి వస్తాడని, వృద్ధిలోకి తెస్తాడని కాంతయ్య నచ్చచెప్పేటప్పటికి కాదన లేకపోయింది. ట్యూషన్లు చెప్పి యింటికొచ్చిన రామేశంతో పెంపుడు సంగతి చెప్తే, తల్లిమీద విరుచుకుపడ్డాడు. మనతోటి సాటే ఏ గంజో తాగుతాడన్నాడు. మనకి కష్టంగా ఉంటేమటుకు, చెట్టుకి కాయలు బరువా? అని ఎదురు ప్రశ్నించాడు. గోవిందయ్యగారికి హృదయంలేదని, ప్రేమానురాగాలు లేవని సుతరాం వల్లకాదని రాద్ధాంతం చేశాడు. పెద్దబ్బాయి పట్టుదల తండ్రి వినకపోలేదు, ఇంట్లో దుమారం, కామేశం చెవిని పడకపోలేదు. తనకి అక్కడ ఇంత స్వతంత్రం ఉంటుందా? స్వంత యింటోకి మళ్లే ఎలా ఉంటుంది? కాని ఇక్కడే అయితే చదువుకి స్వస్తి. అన్నయ్యకి మల్లే ఎక్కడిన్నా బడిపంతులు లేదా గుమాస్తాగిరీ చెయ్యాలి. అన్నయ్య అప్పుడే ప్లీడరుగారి ద్వారా, సుదర్శనంగారి ఫ్యాక్టరీలో మాట్లాడాలని అన్నాడు కూడాను. కష్టపడితేనే కాని ఆమాత్రంఅన్నా రాదు. చదువుమీద ఉన్న ఆసక్తి కొద్దీ అక్కడే బాగుంటుందనిపించింది కామేశంకి. కాంతయ్య ప్రోద్బలంతోటి, రామేశం అయిష్టతతోటీ, తల్లి కన్నీటితోటీ అప్పగింత చేసేశారు. అలాగే సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. కామేశం ఇక్కడికొచ్చి నాల్గవ సంవత్సరం అది. పెద్దతనం వచ్చిపడటంవల్ల గోవిందయ్యగారికి, ఇదివరకటి ఓపిక ఉండటం

లేదు. దానికితోడు డైబిటీసు: ఇదివరకు రాళ్ళు తిని హరాయించుకునేవాడు. ఇప్పుడు ఆ జీర్ణ శక్తి లేదు.

చదువులో మొదటినుంచీ శ్రద్ధ చూపిస్తున్నాడు కామేశం. వచ్చిన "సదవకాశాన్ని, సద్వినియోగం" చేస్తున్నాడు. తనకి ఇక్కడ ఒంటరితనం తప్ప ఇంకేమీ అనిపించడం లేదు. వచ్చిన కొత్తలో భయంకొద్దీ స్వభావంగా ఉండటం అలవాటైన కామేశం, ఇప్పటికి అలాగే ఒంటరిగా, గోవిందయ్యగారితో మాటా-మంతీ లేకుండా కాలక్షేపం చేస్తున్నాడు. ఇది ఎలా పరిణమిస్తుందోనని, తను ఊహించనైనా ఊహించలేదు. కాని ముసలాయన్ని మటుకు, బాగా కలవరపెట్టింది. సాయంత్రం, కాలేజీ నుంచి వస్తూ కామేశ్వరమ్మగారిని చూసేందుకు వెళ్ళకుండా ఉండలేకపోయేవాడు. కాని ఇంట్లో ముసలాయన సంప్రదింపులు లేకుండానే ఆదుకొస్తున్నాడు. ఆ యేడు బి. ఏ. రెండో యేడు అవడంవల్ల, చదువులో విపరీతమైన శ్రద్ధ చూపిస్తున్నాడు. సీజను మార్పువల్ల, వాతావరణం బాగుండక పోవడంవల్ల, ఆ రోజున కొంచెం సుస్తీగా "ఫీ"లయ్యాడు కామేశం. ఆ రాత్రికి తేలిగ్గా భోజనం చేశాడు. మరునాడు భోజనం చెయ్యాలనిపించలేదు. తనని భోజనానికి రమ్మన్నవారూ లేరు. తన సంగతి ఎవ్వరూ అడగనూలేదు. సాయంత్రందాకా ఏదో చదువుతూ అలానే ఉండిపోయాడు. డాక్టరుగారి దగ్గరకి వెళ్ళాలనిపించింది. తన సంగతి ఎవ్వరూ పట్టించుకోక పోవడం చాలా కష్టమనిపించింది ఆలనా-పాలనా లేకపోవడంవల్ల మనుష్యుల నైజాలు బయటపడ్డాయి. తన్ను దత్తు యిచ్చేటప్పుడు కామేశం అనలేదూ "గోవిందయ్యగారిది పాషాణ హృదయమని?" కామేశ్వరమ్మ దగ్గరుంటే సహించేదా మాతృ ప్రాణం? తన పరిస్థితి దుర్భర మనిపించింది కామేశంకి. డాక్టరుగారి ఇంటినుంచి, ఇంటికొచ్చి తల్లిని చూసిన కామేశంకి, తన బాధంతా, బెంగ తీరినట్లు తీరిపోయింది. రెండు రోజులనుంచి సుస్తీ సంగతి వింటే తల్లిప్రాణం తహతహ లాడింది. కాంతయ్య కూడా ఇంత త్వరలోనే మార్పు వస్తుందనుకోలేదు. కామేశం నే నప్పుడే చెప్పానన్నాడు ఆయనకి ప్రేమానురాగాలు లేవని. ఆయనకి డబ్బే ప్రధానమన్నాడు. సుస్తీవల్ల, మనస్సు బాగుండకపోవుటవల్ల కామేశం తిరిగి వెళ్ళలేకపోయాడు. వెళ్ళాలనిపించలేదుకూడాను. పొద్దున్నే గోవిందయ్య ఇంటికి వెళ్ళిన కామేశం గోవిందయ్యగారి యిల్లు తాళంవేసి వుందని చెప్పేసరికి, కాంతయ్యకి ఒళ్ళు మండింది. కుర్రాడు చదువుకొని పైకివస్తాడని యిచ్చారుకాని, నాకేం బరువని?-అని తిట్టిపోశాడు. పరిస్థితులు తారుమారైనందుకు చాలా నొచ్చుకున్నాడు. కామేశం ఇది వినేటప్పటికి కారాలునూరాడు. నే నానాడే చెప్పానని దులిపి వదిలిపెట్టాడు. మనతోటే ఉంటాడంటే విన్నారుకారని దెప్పి పొడిచాడు. కామేశం లోలోపల గోవిందయ్యగారి ఆగ్రహ కారణం ఆలోచిస్తునే వున్నాడు. తను చెప్పకుండా వచ్చెయ్యడంవల్లనే ఆయనకి కోపం వచ్చివుండొచ్చు అనుకున్నాడు. ముసలాయనతో చెప్పివస్తే, వెళ్ళకపోయినా బాగుండేదని కలవరపడక పోలేదు.

* * *

వర్షాలు లేకపోవడంవల్ల, పంటలు బాగా లేవని దానికితోడు ధరలు పడిపోయాయని, కౌలు తగ్గించక పోతే తాము పొలాలు వదులుకుంటున్నామంటూ రైతులంతా గోలచేస్తూ, దెబ్బతిన్నామని రాసిన ఉత్తరాలు గోవిందయ్యగార్ని హడలు కొట్టేశాయి. ఆ రోజల్లా రైతుల గొడవే ఆలోచిస్తుంటే,-కామేశం వెళ్ళిపోయాడని వాడికిక్కడ ఎందుకబ్బుతుందనీ, గోవిందయ్య బతికున్న నాలుగు రోజులన్నా మొహం చూపించకపోతాడా అనుకున్నామని, విధవప్పల టొంపు మాటలు, ఎద్దేవాలతో ముసలాయన మనస్సు మారిపోయింది. కుర్రాడు తనతో మాట్లాడక పోవడంవల్ల బాధపడుతున్న గోవిందయ్యకి ఈ మాటలు, కామేశం అల్లా వెళ్ళిపోవడం. ఈచేష్టలు బాగా ఆగ్రహ పరిచాయి. ఇంతకీ ఆరోజురాత్రి రాకపోవటం ఎంతేనా కోపకారణమయింది. ఈ దుష్టద్వయం మాటలు, అగ్గిలో ఆజ్యం పోసినట్లయి ఆయన్ని, ఒక్కసారి నిరాశచేశాయి. అహంకారం కొద్దీ పోతే పోయాడనుకుని, "ఇంతే ఋణం" అనుకుంటూ, పొలం వ్యవహారాలు

చూసుకునేందుకు మంగమ్మగారితో సహా పొలెంకి బయలుదేరాడు. పనులమధ్య ఒకటి రెండుసార్లు ఊళ్లోకి వచ్చినా కుర్రాడి సంగతి అనుకోలేదు. కాని, తన వాళ్ళతోటి, రైతులతోటి కామేశం సంగతి చెప్పకపోలేదు. కామేశం కూడా గోవిందయ్యగారి రాక వాకబు చెయ్యకపోలేదు. వేసిన తాళం అలాగేవున్నా, గోవిందయ్యగారు వస్తూ పోతూన్నట్లు పక్కింటి బాయమ్మగారు చెప్తే, విని చాలా ఆశ్చర్య పడ్డాడు. ఆ క్రితం రోజే వచ్చారని, ఊళ్ళోకి వచ్చినా కబురు పంపక పోవడం, ఆయనలో ఇంత మార్పుకి కారణం తాను చెప్పకుండా వెళ్ళడమేనని చాలాకలవర పడ్డాడు.

పనులు ఒక ముఖంగా చేసి వెళ్ళిపోవాలని ముసలాయన తొందరపడక పోలేదు. తనగోధుమ నూక అయ్యేలోపుగా విధిగా వచ్చేయాలనేవుంది గోవిందయ్యగారికి. కాని మంగమ్మగారు కోడలికి పురిటి రోజులని, కొడుకు గొప్పడతాడని, తను బయలు దేరాలని సణుగుడు మొదలెట్టేటప్పటికి కాదనలేకపోయాడు. మాణిక్యమ్మ గార్ని రమ్మనవలసినదిగా రాస్తే, తాను ఇప్పుడు రాలేనని దిక్కు మాలిన మనోవర్తి దావావుందని అది ఇప్పుడు తేలేటట్లులేదని, స్పష్టంగా రాయించింది. ఆ దత్తుడి మీద ఆశలు పెట్టుకోవద్దని ఈ అప్పగార్లు ఎంత చెప్తున్నా, కామేశంసంగతి గొప్పగా రైతులతోటి చెప్పుకోవడమే ఆప్తులకి మూతి విరుపులు అని ముసలాయనకి తెలియనే తెలియదు. ఈసాకులు గోవిందయ్యగారికి తెలియనే తెలియవు. తిరిగి వచ్చిన గోవిందయ్యగారు మూలపడ్డాడు. ఆయన వచ్చిం తర్వాత వచ్చి చూడకుండా ఉండలేకపోయాడు కామేశం తన వాళ్ళంతా ఎంతవద్దంటున్నా. ఇంట్లో కామేశం కూడా లేకుండా, తను ఏకాకిగా ఉండడం గోవిందయ్యగారి మనోవ్యధకి అంతులేకుండా ఉంది. తనని పైకి తీసుకొని వస్తున్న ముసలాయన బాధ్యత గ్రహించమని బోధించినది అంతరాత్మ. ముసలాయన్ని క్షమార్పణ అడగాలనిపించింది కామేశంకి.

బాధతో మూల్గుతూన్న ముసలాయన్ని చూసి, మాట్లాడేందుకు బిడియపడ్డాడు కామేశం. "ఎవరు నాయనా?" అన్న గోవిందయ్యగారి ప్రశ్న కలవరపెట్టింది కుర్రాడిని.

"నేను బాబయ్యగారూ, కామేశంని," అన్న సమాధానం వింటేనే ఆయన బాధంతా తగ్గినట్లనిపించింది. పేదకు పెన్నిధి దొరికినట్లయింది. "ఎలా ఉన్నారూ?" అంటుంటేనే గోవిందయ్యగారి మొహం చేటంత అయింది. "డాక్టరుగార్ని పిలిపించ మంటారా?" అన్న మాటలు వింటుంటే కామేశంలో ఎంతప్రేమో అనిపించింది. కుర్రాడిని గురించి పొరపడ్డాననిపించింది ముసలాయనకి. తనువచ్చి నానా అవస్థాపడుతుంటే బయటివాడికి ఎప్పుడికి పట్టుతుంది? అపార్థం చేసుకున్నానని చాలా నొచ్చుకున్నాడు. డాక్టరుగారికి కబురు పంపిస్తూ, తన తలిదండ్రులకు కూడా రమ్మని కబురు పంపాడు కామేశం. మూడు, నాలుగు రోజుల దాకా మన లోకంలో లేడు ముసలాయన. స్పృహలోకి వచ్చేటప్పటికి ఇల్లు సందడిగా ఉంటే, చాలా బాగుందనిపించింది. సమయంలో వచ్చి ఆదుకొన్నందుకు కాంతయ్యగారికి, ధర్మపత్నికి ఋణం తీర్చుకోలేనన్నాడు. కామేశం ఆయన దగ్గరే కూర్చుండేవాడని విని ఆనంద బాష్పాలు వదిలాడు.

ఆ వేసవిలోనే మూర్తిరాజూగా రమ్మాయి సావిత్రి నిచ్చి, ముడిపెట్టారు కామేశంకి. మామగారి ప్రాక్టీసు చూచుకునే ఒప్పందంమీద "లా" కాలేజీలో చేరాడు కామేశం.

---

ఐక్యరాజ్యసమితి సాంకేతిక సహాయ కార్యక్రమ ప్రతినిధిగా అమెరికన్ శాస్త్రవేత్త డాక్టర్ రియాన్ స్టీనిగ్ న్యూఢిల్లీకి ప్రయాణమైనాడు. సమితియొక్క ప్రత్యేక శాఖలనుంచి తనకు కావలసిన సాంకేతిక సహాయం పొందడంలో ఆయన భారత ప్రభుత్వానికి సహాయపడగలడు. భారత ప్రభుత్వంతో సంప్రదించిన మీదటనే ఈ నియామకం జరిగింది. ఆర్థిక విషయాలన్నింటిని సమన్వయంచేసే నిమిత్తం భారత ప్రభుత్వం ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించింది. ప్లానింగ్ కమిషన్ సహకారంతో ఈ సంఘం పని చేస్తుంది.